సాక్షి
అనంతపురం
ఆదివారం। 15। జనవరి। 2023

న్యూస్‌రీల్

వణికిస్తున్న చలి

- మరింత తగ్గుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాత్రి పూట ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. శీతల గాలులు కూడా తోడు కావడంతో వేకువ జాము నుంచి ఉదయం 10 గంటల వరకు చలి గజగజ వణికిస్తోంది. శనివారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిర, అగళిలో 8.7 డిగ్రీలు, అనంతపురం జిల్లా శెట్టూరులో 10.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తనకల్లు 9.7 డిగ్రీలు, రొద్దం 10 డిగ్రీలు, సోమందేపల్లి 10.5 డిగ్రీలు, గుమ్మఘట్ట, గాండ్లపెంట 10.7 డిగ్రీలు, బెళుగుప్ప 11 డిగ్రీలు, నల్లమాడ 11.2 డిగ్రీలు, ఎన్పీ కుంట, నల్లచెరువు 11.3 డిగ్రీలు, కనగానపల్లి 11.4 డిగ్రీలు, కంబదూరు, కుందుర్పి, లేపాక్షి 11.5 డిగ్రీలు, అమడగూరు 11.6 డిగ్రీలు, ఓడీ చెరువు, గుడిబండ 11.7 డిగ్రీలు, పుట్లూరు 11.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో 12 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ట, 27 నుంచి 32 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగాయి. మడకశిర, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది.

రేపు స్పందన ఉండదు

అనంతపురం అర్బన్: కనుమ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ఈ నెల 16వ తేదీ (సోమవారం) సెలవు ప్రకటించిందని, అందువల్ల ఆ రోజు నిర్వహించాల్సిన 'స్పందన' రద్దు చేసినట్లు డీఆర్‌ఓ గాయత్రిదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

నేడే చివరి అవకాశం

- ఈ–కేవైసీ లేదంటే పీఎం కిసాన్ సొమ్ము రానట్లే



అనంతపురం అగ్రికల్చర్: ఈ–కేవైసీ నమోదుకు ఆఖరి అవకాశం ఆదివారంతో ముగియనుంది. పీఎం కిసాన్ ద్వారా ఏటా మూడు విడతల్లో కేంద్రం ఇచ్చే రూ.6 వేల కోసం 'ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ–కేవైసీ)' నమోదు తప్పనిసరి అని నిబంధన విధించింది. త్వరలో 13వ విడత కింద పీఎం కిసాన్ ద్వారా తుది విడతగా రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లోకి జమ కానుంది. దీనికి అర్హత కలిగిన ప్రతి రైతూ ఆదివారం లోపు ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ , అలాగే ఓటీపీ నంబరు ఆధారంగా అథెంటిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మీ–సేవ లేదా కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఆర్‌బీకే అసిస్టెంట్లు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించాలి. www.pmkisan.gov.in అనే లింక్‌ను ఉపయోగించి స్వయంగా ఇంటర్‌నెట్ కలిగిన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో కూడా ఈ–కేవైసీ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఒకసారి జాబితా నుంచి తీసేస్తే మళ్లీ అర్హత పొందడం చాలా కష్టమని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా వస్తున్న రూ.7,500 కూడా ఆగిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,31,226 పీఎం కిసాన్ అకౌంట్లు ఉండగా... ఇంకా 50 వేల పైచిలుకు అకౌంట్లకు ఈ–కేవైసీ పెండింగ్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆదివారం చివరి అవకాశంగా భావించి ఈ–కేవైసీ చేయించుకోవాలి. మళ్లీ గడువు పొడిగించడం ఉండకపోవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ తెలిపారు.



కళ్యాణదుర్గంలో రంగవల్లిని తీర్చిదిద్దుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



అనంతపురంలో భోగి మంట వద్ద యువతులు



అనంతపురంలో చిన్నారులపై భోగిపండ్లు పోస్తున్న తల్లులు

• సరదాల సంక్రాంతి..ఆనందాల లోగిలి..

జిల్లా వ్యాప్తంగా భోగభాగ్యాల భోగి పండుగను ప్రజలు శనివారం సంబరంగా జరుపుకున్నారు. చిన్నారులపై భోగి పండ్లు (రేగి పండ్లు, బంతిపూలు, చామంతి, గులాబీ, రుపాయి నాణేలు) పోసి ఆశీర్వదించారు. అగ్నిదేవుడి సాక్షిగా కీడు తొలగి, పుణ్యం ప్రాప్తింపజేయాలని వేడుకుంటూ చిన్నా పెద్ద భోగి మంటలు వేశారు. పాత వస్తువులను మంటల్లో వేసి దహనం చేశారు. ఊరూవాడ ప్రతి లోగిలిని రంగవల్లులతో రంగరించారు. గాలి పటాలు ఎగురవేసి సరదాగా గడిపారు. ఇంటిల్లిపాది, బంధుమిత్రులతో కలిసి పిండివంటలు ఆరగించారు. ఆదివారం మకర సంక్రాంతికి నూతన వస్త్రాలు, పసందైన వంటలకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఏ ఇంట చూసినా సంక్రాంతి సందడి కనిపిస్తోంది.

-అనంతపురం కల్చరల్:



అనంతపురంలో ఓ ఇంటిపైన గాలిపటం ఎగరేస్తున్న చిన్నారులు



యాడికి మండలం రాయలచెరువులో ముగ్గుల పోటీలో హరిదాసు వేషధారణలో పిల్లలు



ఉరవకొండలో భోగి మంటల వద్ద కోలాటం చేస్తున్న మహిళలు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

- విప్ కాపు రామచంద్రారెడ్డి
- ముగిసిన ఆర్‌వైఎస్‌ఎల్ క్రీడా పోటీలు





విజేతలకు బహుమతులు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎస్పీ ఫక్కీరప్ప, యువ నేత ప్రవీణ్‌రెడ్డి

రాయదుర్గం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని సత్తా చాటుకోవాలని సూచించారు. క్రీడల్లో సత్తా చాటితే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ యువ నేత కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ 21న ప్రారంభమైన మెగా క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. క్రికెట్, వాలీబాల్, హాకీ, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు, కుస్తీ పోటీల్లో జిల్లా, అంతర్ రాష్ట్రాల నుంచి వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల స్థాయిలో పూర్తయ్యాక నియోజకవర్గ కేంద్రం రాయదుర్గంలో తదుపరి మ్యాచ్‌లు జరిగాయి. ఫ్లడ్ లైట్ల వెలుగులో సైతం క్రీడలు నిర్వహించారు. ఆఖరి రోజు జూనియర్ కళాశాల మైదానంలో గుమ్మఘట్ట లయన్స్, రాయదుర్గం ఫ్రెండ్స్ ఆర్గనైజింగ్ జట్లు క్రికెట్ ఫైనల్‌లో తలపడ్డాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో గుమ్మఘట్ట లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. వాలీబాల్ విజేతగా రాయదుర్గం, రన్నర్‌గా గోనబావి జట్టు, కబడ్డీ విజేతగా కోట బ్యాడ్ బాయ్స్ జట్టు, రన్నర్‌గా ఈగల్ వారియర్స్ జట్టు, హాకీ విజేతగా ప్యాల్కన్ క్లబ్ బెంగళూరు, రన్నర్‌గా కెనడా బ్యాంక్ బెంగళూరు జట్టు నిలిచాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలు అంబరాన్నంటేలా నిర్వహించారు. క్రీడా విజేతలు, రన్నర్ జట్లకు నగదుతో పాటు కప్‌లను రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎస్పీ ఫక్కీరప్ప, రెడ్ క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి, వైఎస్సార్‌సీపీ యువ నేత కాపు ప్రవీణ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. విప్ కాపు మాట్లాడుతూ ముఖ్యంగా మహిళా క్రీడాకారులు సైతం పురుషులతో సమానంగా పోటీల్లో పాల్గొని సత్తా చాటారన్నారు. క్రీడాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

సంప్రదాయ క్రీడా పోటీలు అభినందనీయం

సంక్రాంతి పండుగ వేళ జూదాలు, పందేల వంటి వాటి జోలికి వెళ్లకుండా ఆర్‌వైఎస్‌ఎల్ మెగా టోర్నీలో సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించడం అభిందనీయమని ముఖ్య అతిథి ఎస్పీ ఫక్కీరప్ప అన్నారు. యువత పోలీస్ ఉద్యోగాల్లో చేరి దేశ భద్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోలీస్, ఎస్‌ఐ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే యువతకు ఉచిత కోచింగ్ ఇస్తున్నామని, ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అందరికీ కృతజ్ఞతలు

క్రీడా పోటీల నిర్వాహకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి మాట్లాడుతూ క్రీడా పోటీల విజయవంతానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతర్రాష్ట్ర క్రీడాకారులు సైతం ఈ పోటీల్లో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. టోర్నీ నిర్వహణకు దాదాపు రూ.40 లక్షలు వెచ్చించినట్లు వెల్లడించారు. క్రీడా పోటీల ముగింపు రోజున తిలకించేందుకు 4వేల మంది తరలిరావడం రాయదుర్గం చరిత్రలో రికార్డుగా నిలిచిందన్నారు.

విజేతల ఊరేగింపు

క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారిని రాయదుర్గంలో డీజే, ఉరాలు, తప్పెట్ల వాయిద్యాల నడుమ ఊరేగించారు. దీంతో సంక్రాంతి సందడి కనిపించింది. కార్యక్రమంలో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడితో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

• ఆకట్టుకున్న నృత్యప్రదర్శన



అనంతపురం రూరల్: శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. అమృత కూచిపుడి కళానిలయం ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తెలిపారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం



తాడిపత్రిలో గోదాదేవి, చింతలరాయుడి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

గుంతకల్లుటౌన్/ తాడిపత్రిటౌన్: గోదాదేవి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. గుంతకల్లు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు గోదాదేవి, విష్ణుమూర్తిని విశేషపుష్పాలతో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవం జరిపించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ వారు విందు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, సుదర్శన్‌బాబు, సభ్యులు జయంతి వెంకట్, వీరాంజినేయులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- తాడిపత్రిలోని ప్రసిద్ధ చింతల వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం రాత్రి గోదాదేవి, చింతల వేంకటరమణస్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదాదేవి, చింతలరాయుడి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం అర్చకుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారు, స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, సభ్యులు సంజన్న, భూమా హరి, మద్యత లత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



గుంతకల్లులో గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆయుర్వేదంతో రుగ్మతలు దూరం

హిందూపురం: ఆయుర్వేద వైద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దీర్ఘకాలిక రుగ్మతలు సైతం ఆయుర్వేద వైద్యంతో నయమవుతాయని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. హిందూపురం మండలం సంతేబిదనూర్‌లోని ఆయుర్వేద వైద్యశాలను శనివారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని వసతులు, అందిస్తున్న సేవలపై స్థానిక వైద్యురాలు అనురాధను ఆరా తీశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించుకుని, మందులు తీసుకున్నారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గిరిజమ్మ
- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి


పోటీకి సన్నద్ధమవుతున్న వృషభాలు

అనంతపురం రూరల్: రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య స్పష్టం చేశారు. 'మన ఊరు మన సంక్రాంతి' కార్యక్రమంలో భాగంగా అనంతపురం మండలం ఎ.నారాయణపురం పంచాయతీలో 'దక్ష కన్‌స్ట్రక్షన్' ఎండీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ ఛైర్ పర్సన్ గిరిజమ్మ, తదితరులు హాజరై, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉండి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలన్న ఉద్దేశ్యంతో ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి సొంత డబ్బుతో రాష్ట్ర స్థాయి బండలాగుడు, ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంక్రాంతి పండగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, ఉమ్మడి భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరు కర్ణాటకలోని జేడీఎస్ పార్టీకి చెందిన యువనేత కాగా, మరొకరు చెన్నేకొత్తపల్లి మండల నివాసి.


వేణు (ఫైల్)


ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

పావగడ/రొద్దం: కారు ప్రమాదంలో జేడీఎస్ యువనేత దుర్మరణం పాలయ్యాడు. రొద్దం పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా వెంకటమ్మనహళ్లి నివాసి ఎగువపల్లి వేణు (46) జేడీఎస్ పార్టీలో యువ నేతగా గుర్తింపు పొందాడు. తన బావమరిది పెళ్లికి సంబంధించి వివాహ సామగ్రి, ఇతర వస్తువులను బెంగళూరులో కొనుగోలు చేసి, భార్య భార్గవి, పిల్లలతో కలసి కారులో శుక్రవారం వెంకటమ్మనహళ్లికి బయలుదేరాడు. రాత్రి 11 గంటలకు పెనుకొండ నుంచి రొద్దం వెళ్లే దారిలో బొక్సంపల్లి క్రాస్ వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు వేప చెట్టును బలంగా ఢీకొంది. ఘటనలో కారు నడుపుతున్న వేణు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని పక్క సీటులో కూర్చొన్న అశ్వత్థప్పకు కాలు విరిగింది. భార్య భార్గవి, కుమారుడు వికాస్‌తో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రొద్దం ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. కాగా, వేణుకు ఇద్దరు కుమారులుండగా.. మధ్యప్రదేశ్‌లో చదువుతున్న మరో కుమారుడు నితిన్ శనివారం రాత్రికి విమానంలో బెంగళూరుకు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన స్వగ్రామానికి చేరుకోనున్నాడు. ఈ క్రమంలో నితిన్ వచ్చిన తర్వాత ఆదివారం వేణు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వేణు మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ నాయకులు మానం వెంకటస్వామి, సొగడు వెంకటేష్, కాంగ్రెస్ నాయకుడు చన్నమల్లయ్య, ఇతర పార్టీల నాయకులు వెంకటమ్మనహళ్లికి చేరుకుని మృతుడికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...

కొత్తచెరువు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ లింగన్న తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లికి చెందిన నాగార్జున (23), వినోద్ శుక్రవారం కొత్తచెరువులో సినిమా చూసి, రాత్రికి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి మైలేపల్లి సమీపంలో బీఈడీ కళాశాల వద్ద వెళుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక నాగార్జున మృతి చెందాడు. వినోద్ కోలుకుంటున్నట్లు సమాచారం. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా వెళ్లిపోవడంతో గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లుగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

బత్తలపల్లి: పశువులకు ట్రాక్టర్‌లో గ్రాసం తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. వివరాలు... బత్తలపల్లికి చెందిన పాడి రైతు రమేష్.. ఎం.చెర్లోపల్లి గ్రామంలో గడ్డిని కొనుగోలు చేశాడు. ఈ గడ్డిని బత్తలపల్లికి చెందిన పోతులయ్య ట్రాక్టర్‌లో శనివారం తరలించసాగాడు. బత్తలపల్లి సచివాలయం వద్దకు చేరుకోగానే కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించిన పోతులయ్య ట్రాక్టర్ ఆపి కిందకు దూకాడు. ఘటనలో అతని ఎడమ కాలు రెండు చోట్ల విరిగింది. విషయాన్ని గమనించి అక్కడి శివాలయం వద్ద శివదీక్షాపరులు వెంటనే స్పందించి క్షతగాత్రుడుని పక్కకు లాగారు. ట్రాక్టర్ ట్రాలీ ఎత్తి గడ్డి మొత్తం కిందపడేలా చేశారు. గడ్డి పూర్తిగా కాలిపోయింది. క్షతగాత్రుడిని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఘటనలో రూ.12 వేలు విలువ చేసే గడ్డి కాలి బూడిదైనట్లు పాడి రైతు రమేష్ తెలిపారు.

ఉచిత వంట గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

కొత్తచెరువు: సంచార జాతుల్లో గుడారాలు వేసుకుని జీవిస్తున్న 17 నిరుపేద కుటుంబాలకు సత్యసాయి భక్తురాలు, అమెరికాకు చెందిన న్యూసిన్ ప్రెసిడెంట్ ఏంజెల్స్ జాయ్ ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లను అందజేశారు. కొత్తచెరువులోని ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సెక్రటరీ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ... కట్టెల పొయ్యిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సంచార జాతులను గుర్తించి, వారికి ఏంజెల్స్ జాయ్ సౌజన్యంతో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇదే సమయంలో పిల్లలకు ఉచితంగా విద్యా సామగ్రిని, గాలిపటాలు, ఆట వస్తువులను వితరణ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పద్మావతి, హరిగోపాల్, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

నిఖర సైట్‌లో అగ్ని ప్రమాదం

అమడగూరు: మండలంలోని గువ్వలపల్లి సమీపంలో వంద ఎకరాల్లో విస్తరించిన నిఖర సైట్‌లో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

NURSING ASST. TRAINING

■ 10th / ఇంటర్ / డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన మహిళలకు నర్సింగ్ అసిస్టెంట్ కోర్స్ నందు ఫ్రీగా ట్రైనింగ్ ఇచ్చి, జాబ్ కల్పించబడును. సంప్ర॥ G.మురళి, 9030661651, ATP. [A-752468]

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

■ గ్రామ సచివాలయం / పోలీస్ కానిస్టేబుల్/S.I. (ప్రిలిమ్స్ & మెయిన్స్) / స్పోకెన్ ఇంగ్లీష్ / RRB / VRO / VRA అభ్యర్థులకు ఉచిత శిక్షణకై. సంప్ర॥ లిటిల్ ఫ్లవర్ స్కూల్, ATP. 9290200675. [A-243]

శ్రీ శ్రీనివాస ట్యుటోరియల్స్

■ Inter I, IInd years కి - IPE 40 days Coaching (Maths, Phy, Chem.) Short Term Coaching for NEET/JEE. Addr: Opposite: VISHAL MART, R.C. Nagar, ATP. Ph: 9618562274, 8500140577. [A-7969]

HOME TUTIONS

■ Inter, Diploma, 10th Maths General & Home Tuitions are available timings are your choice. Cell: 9505277169, 7989646177. [A-251]

REAL ESTATE

PLOT FOR SALE

■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-261]

■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-260]

■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-259]

■ ATP బైపాస్, Besides హార్మోని సిటీ, అన్ని వసతులుగల ప్లాట్లు (ప్లాటు సైజ్ 33'X40') అమ్మకమునకు కలవు. సంప్ర॥ డైరెక్ట్ ఓనర్. సెల్: 9490064544. [A-752476]

TOLET / SALE

■ రాంనగర్‌లో షాపు బాడుగకు / అమ్మకానికి కలదు. చికెన్ షాపుకి వర్కర్స్ కావలెను. సంప్ర॥ సెల్ : 8074429294, 9542093517. [A-257]

5 ఫ్లోర్స్ బిల్డింగ్ బాడుగకు

■ ATP టౌన్, RTO ఆఫీస్ ఎదురుగాగల రోడ్‌నందు 5 సెంట్లలో 5 ఫ్లోర్స్ బిల్డింగ్ కాలేజ్ / స్కూల్స్ / కోచింగ్ సెంటర్స్‌కి అనువైన ఫర్నీచర్‌తో (ఆఫీస్‌లకు, హాస్టల్స్/ బ్యాంక్స్ / ఫైనాన్స్ సంస్థలకు) బాడుగకు కలదు. సెల్: 9948870035, 7569994305. [A-752470]

TOLET/ COMMERICIAL

■ JNTU కాలేజీరోడ్డు ATP, సూపర్‌స్పెషాలిటీ దగ్గర బ్లడ్‌బ్యాంక్ ఎదురుగా ఉన్న 2 షాపులు బాడుగకు ఇవ్వబడును. డాక్టర్స్/ మెడికల్ షాపులకు అనుకూలం. సంప్ర: 9866457671 [G-5957]

LEASE

■ Warehouse Available for Lease near Lanchester Road, Guntur, 16000 Sft. Space Situated on 7000 Sq. yards Land. Cont.: 8790205228. [HA-3268]

FOR SALE

■ ప్రముఖ కాలేజీ యందు సివిల్, మెకానికల్, ఎలెక్ట్రికల్, కంప్యూటర్ ల్యాబ్స్ పరికరములు అమ్మకమునకు కలవు. సెల్ : 8309781667. [A-752473]

EMI ద్వారా ఫ్లాట్లు

■ శ్రీలక్ష్మి టౌన్ షిప్ నందు EMI పద్ధతిలో రెసిడెన్షియల్ / కమర్షియల్ ఫ్లాట్స్ తక్కువ ధరల్లో డెవలప్‌మెంట్స్‌తో కలవు. వెంటనే సంప్ర॥ లక్ష్మి : 9642999005. [A-752467]

3 BHK FLAT FOR SALE

■ అనంతపురము రామ్‌నగర్, 80ft రోడ్డు, PARK VIEW HEIGHTS అపార్ట్‌మెంట్ నందు అన్ని వసతులు, కార్ పార్కింగ్, వుడ్‌వర్క్, POP ఉన్న ఉత్తరం ఫేస్ 3 బెడ్ రూమ్స్ లగ్జరీ ఫ్లాట్ అమ్మబడును. Cont : 9966030786, 7013106544. [A-2275]

SERVICES

శ్రీ కృష్ణ జ్యోతిష్యాలయం

■ మైసూర్ కి చెందిన ప్రఖ్యాత జ్యోతిష్యులు శ్రీ జనార్దన్ జ్యోషి గారు మీ హస్తరేఖ, జాతకం చూసి సంపూర్ణ భవిష్యత్ చెప్పెదరు. విద్య, ఉద్యోగ, వ్యాపార, సంతాన, స్త్రీ/పురుష ప్రేమ, భార్యభర్తల సమస్య, ఆరోగ్యం, వ్యాపారం, విదేశీయానం, మనశాంతి మొ॥ అన్ని సమస్యలకు శాస్త్రోక్తంగా, అతిశీఘ్రంగా సంపూర్ణ పరిహారం చూపబడును. దూర ప్రాంతాలవారు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చును : 9908626148. [A-235]

మణిద్వీపం

■ ATP నందు, మా వద్ద సహజసిద్ధమైన రత్నాలు, ముత్యాలు, వజ్ర, వైడూర్య, గోమేధికాలు, మరకత మణులు (పచ్చలు), కెంపులు, కనక పుష్యరాగాలు, ఇంద్ర నీలాలు, పగడాలు, సూర్య/చంద్ర కాంతామణులు, హారములు లభించును. సెల్: 9490064544. [A-752475]

CHANGE OF NAME

■ I, SAMA RAJA SEKHAR (Old Name) S/o SAMA LAKSHMI NARAYANA, D.No: 1-1125-52-1B, Near Water Tank, Kadiri - 515 591, Changing My Name From - SAMA RAJA SEKHAR (Old Name) To SOMA RAJA SEKHAR (New Name) Henceforth I am being called as SOMA RAJA SEKHAR For All Purposes. [A-6028]

RHEUMATOLOGIST

■ కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలో మొట్టమొదటి ఎకైక కీళ్ళవ్యాధి నిపుణురాలు. డాక్టర్. ఎ.స్రుజన, M.D., DM., NIMS (Hyd) ప్రత్యేకతలు : చేతులు, మణికట్టు, కీళ్ళలో నొప్పి, వాపు రావడం. ప్రొద్దున్నే లేవగానే నడవలేకపోవడం పాదాలు వాపులు రావడం అరిచేతి వ్రేళ్ళు వాపులు రావడం వెన్ను మెడ వంగడం, కాళ్ల బొటనవ్రేళ్లపై పుండ్లు రావడం, వెన్నుపూస వంగిపోవడం, మోకాళ్ళు అరిగిపోవడం, నోటిలో యర్రపుండ్లు రావడం, చిన్నపిల్లల కీళ్ళధులకు చూడబడును. క్లినిక్ జీవన్ రాయలసీమ సూపర్ స్పెషాలిటీ, గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా, కలెక్టర్ ఆఫీస్, కర్నూలు. 08518-255502, సెల్: 81064 60012 [L-793211]

WANTED

■ శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, అనంతపురము నందు సేల్స్ ఆఫీసర్స్‌గా పనిచేయుటకు మార్కెటింగ్ రంగంలో 3 సం॥ల అనుభవం కల్గి, స్థానికులుగా ఉన్నవారు కావలెను. సెల్ : 9440943333 [A-2320]

■ టెలికాలర్స్ జాబ్స్ : ATP లో, మా ఆఫీస్ నందు వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Age: 35 సం॥లోపు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు సంప్ర॥ సెల్: 9160429288, 7997757059. [A-752466]

■ మేనేజర్స్ కావలెను. MGM యాత్రినివాస్, RTC బస్టాండ్ కాంప్లెక్స్, ATP నందు మేనేజర్లు కావలెను. వర్క్ టైమింగ్స్ : 7 PM to 5 AM. వెంటనే సంప్ర॥ సెల్ : 6281997106, 8500233824. [A-752478]

■ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000 నుంచి 20,000 వరకు జీతం. మరిన్ని వివరాలకై సంప్ర:6301728311 [G-776030]

■ బయో మాగ్నెటిక్ హెల్త్ ప్రొడక్ట్స్ కొరకు మార్కెటింగ్ చేయువారు M/F కావలెను. Qly: Any డిగ్రీ, (వర్క్‌ఫ్రమ్ హోమ్) మంచి ఆదాయం, పార్ట్ టైం & ఫుల్‌టైం. సంప్ర: 7416404028. [H-792695]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776023]

■ మా ఒక్క రూ. వడ్డీ అప్పు పథకములు అమలు పరచి జీతం లేదా కమీషన్ పొందు స్త్రీ, పురుషులు వివరాలకు సంప్ర. సురభి నిలయం షాద్ నగర్. ఫోన్ : 9502907465. [H-792574]

■ ATP లో ప్రముఖ హార్డ్‌వేర్, గ్లాస్ & ప్లైవుడ్ షాపులో హెల్పర్‌గా పనిచేయుటకు, 25-30 సం॥ల వయస్సుగల యువకులు కావలెను. చదువు అవసరం లేదు. స్థానికులకు మాత్రమే. Cont: 9440287989. [A-258]

■ ATP, MNC కంపెనీకి 40 సం॥ల నుండి 65 సం॥లు కల్గిన రిటైర్డ్ ఎంప్లాయీస్, VRS తీసుకున్న M/F, House Wifes కావలెను. సెల్ : 7780117898. [A-752477]

■ శ్రీలక్ష్మి టౌన్‌షిప్‌లో పనిచేయుటకు G.M., M.M., M.E., టెలికాలర్స్ కావలెను. రిటైర్డ్ / అనుభవంగల వారికి ప్రాధాన్యత. జీతం + ఇన్సెంటీవ్స్. సెల్: 9642999004, 9642999005 [A-752474]

■ అనంతపురంలోని ప్రముఖ బట్టల షాపు నందు సేల్స్ చేయుటకు అనుభవం గల లేడీస్ / జెంట్స్ కావలెను. Contact : 9959247543. [A-258]

■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు, బిల్డింగు కట్టుటకు అనుభవజ్ఞులయిన సివిల్ ఇంజనీర్లు కావలెను. సంప్ర॥ సెల్: 8309781667. [A-752472]

■ NRI తల్లిదండ్రులను, వృద్ధులను వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు, ఆయాలు, కేర్‌టేకర్స్ M/F హెల్పర్లు కావలెను. Salary 14-20K వసతి + భోజనం కలదు. ✆ 91608 35559, 78158 35561 [B-781]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

తోపుదుర్తి గ్రామోత్సవానికి తరలిరండి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపు



ఆత్మకూరు: తోపుదుర్తి గ్రామంలో ఈ నెల 18న జరగబోవు పెద్దమ్మ తల్లి ఊరుదేవర (గ్రామోత్సవం)కు నియోజకవర్గంలోని ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. 140 ఏళ్ల తర్వాత గ్రామంలో గ్రామోత్సవం జరుగుతోందన్నారు. తోపుదుర్తిలో జరిగే పండుగను ప్రతి ఒక్కరూ మన ఇంటి పండుగలా భావించి, ప్రతి ఒక్కరూ రావాలని తెలియజేశారు. 18న పెద్ద ఎత్తున విందు ఉంటుందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి అందరినీ పిలిచి విందు ఏర్పాటు చేసే అవకాశం రాలేదని, ప్రస్తుతం తోపుదుర్తిలో జరగబోవు గ్రామోత్సవానికి ప్రతి ఒక్కరూ ఇదే ఆహ్వానంగా భావించి, తరలిరావాలని పిలుపునిచ్చారు.

డైరీల ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆలిండియా గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ (బీఎస్ఎన్ఎల్) అనంతపురం జిల్లా నూతన డైరీని ఎంపీ తలారి రంగయ్య శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. స్థానిక ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఆల్ ఇండియా గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న లింగమయ్య

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో దోబీఘాట్ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన దోబీఘాట్‌ను సందర్శించారు. లింగమయ్య మాట్లాడుతూ రజకులు సంబంధించిన దోబీఘాట్ స్థలాన్ని కబ్జా చేయడం చాలా బాధాకరమన్నారు. అధికారులు స్పందించి దోబీఘాట్ స్థలాన్ని రజకులకు దక్కేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రజక వృత్తిదారుల జిల్లా కార్యదర్శి సీపీ హరికృష్ణ, ఉపాధ్యక్షులు సి.నాగప్ప, నాగభూషణం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం వివేకానంద జీవితం

అనంతపురం కల్చరల్: స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శమని వక్తలు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని తిథి ప్రకారం శనివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమితి ప్రధాన కార్యదర్శి శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలరావు, జయపాల్‌రెడ్డి తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై వివేకానంద జీవితం గురించి మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు పలు అనాథ శరణాలయాల్లో పండ్లు, పాలు అందించారు.

పండుగ సంతోషంగా జరుపుకోండి



అయ్యవారిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

రాప్తాడు: మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం ఆయన అయ్యవారిపల్లి, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి, గ్రామాల్లో సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకోవాలని అవగాహన కల్పించారు.ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పేరు చెప్పి కొందరు జూదాలు, కోడి పందేలు ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

వేపకుంటలో వైద్యశిబిరం

కనగానపల్లి: మండలంలోని వేపకుంటలో మైసూరు సర్వధర్మ ఆశ్రమ పీఠాధిపతులు మమతమ్మ, మేనేజ్‌మెంట్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

సంబరంగా భోగి పండుగ



చిన్నారులకు భోగి పళ్లు పోస్తున్న వాసంతి సాహిత్య



రాప్తాడులో భోగి మంటలు వేసిన గ్రామస్తులు

రాప్తాడు: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి. మొదట రోజు భోగి, నేడు సంక్రాంతి, తరువాత కనుమ. పల్లె ప్రజలకు కలల పండుగ. చూసేవారికి కనుల పండుగ, సంక్రాంతి పండుగకు ఆలయాలు, గ్రామాలు చక్కగా ముస్తాబయ్యాయి. బంధుమిత్రులు, కూతుర్లు,అల్లుళ్లతో ఊళ్లన్నీ సందడిగా మారాయి. ముంగిళ్లలో రంగు రంగుల ముగ్గులు, ఆటపాటలతో పిల్లలు, యువకులు భోగి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ధనుర్మాసానికి దక్షిణాయనానికి ఆఖరు రోజు భోగి. దీంతో గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్లల్లో ఉన్న పాత వస్తువులు, తాటాకులు, కొయ్యలు, టైర్లు, చేటలు, పరకలు బయటకు తెచ్చి భోగి మంటల్లో వేసి చలికాచుకున్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని ప్రజలు భోగి పండుగను శనివారం జరుపుకున్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శనివారం సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి ఇంటి ముందు కళ్లాపి చల్లి , రంగు రంగులతో ముగ్గులు వేశారు. ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు పూజలు చేశారు.

కనగానపల్లి: మండల ప్రజలు భోగి పండుగను సంబరంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. ఇళ్ల ముంగిట మహిళలు అందమైన ముగ్గులు వేసి, వాటిపై గొబ్బెమ్మలు పెట్టి పూజ చేశారు. స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇక ఆదివారం చేసుకునే మకర సంక్రాంతి పండుగకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

సంప్రదాయాన్ని చాటిన బంజారాలు

అనంతపురం కల్చరల్: స్థానిక బంజరా భవన్ ప్రాంగణంలో ఆలిండియా బంజరా సేవా సంఘ్ ఆధ్వర్యంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలాజీ నాయక్, బాబు నాయక్, వ్యవసాయశాఖ డీపీఓ చంద్రానాయక్, డాక్టర్ రామస్వామి నాయక్ ఆత్మీయ అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులందించారు. అనంతరం బంజారా భవన్ స్థలదాత డాక్టర్ శ్రీనివాస్, హరిగౌరిని సన్మానించారు.

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనృత్యకళానిలయం, సాయి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి తిరుప్పావై కంఠస్థ పోటీలు, చిన్నారుల గోదాదేవి, చిన్ని కృష్ణుల పోటీలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ట్రస్టు అధ్యక్షుడు విజయ్ సాయి, ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనిధి రఘు తదితరులు చిన్నారులకు బహుమతులందించారు. అంతకు ముందు గోదాదేవి గోవిందుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేక, అలంకార సేవలు చేశారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

అనంతపురం: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎల్ఐజీ కాలనీలో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీజేపీ మహిళ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విశాలరెడ్డి నేతృత్వంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, అమ్మాయిలు ముగ్గుల పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఆమె చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే భారతీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. రైతులు తమ తొలి పంట ద్వారా సంతోషాలు నిండాలని ఈ ఏడాదంతా వారికి అన్ని శుభాలే కలగాలని కోరుకున్నారు. తన ఆధ్వర్యంలో మరిన్ని పోటీలు నిర్వహిస్తామన్నారు.

సంప్రదాయాలను మరువకూడదు

అనంతపురం కల్చరల్: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. శనివారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక తపోవనం లోని శ్రీశివసాయి బాబా మందిరంలో 50 మంది చిన్నారులకు భోగిపండ్ల ఉత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వాసంతి సాహిత్య చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాయిట్రస్టు నిర్వాహకుడు విజయ్ సాయి, శ్రీరాములు, దేవేంద్ర, నారాయణ పాల్గొన్నారు.



రాప్తాడులో భోగి మంట దగ్గర చిన్నారులు



హౌసింగ్ బోర్డు కాలనీలో బహుమతులు అందిస్తున్న దృశ్యం



రాప్తాడులో మహిళలు వేసిన ముగ్గు



కనగానపల్లిలో ఓ ఇంటి ముంగిట వేసిన అందమైన ముగ్గు

ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం సప్తగిరి సర్కిల్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సంబరాలతో తెలుగు లోగిళ్ల శుభాలకు, సుఖ సంతోషాలకు నెలవు కావాలని కోరారు. రైతుల ఇంట ఆనందాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న మాటకు కట్టుబడి దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లుగా రైతుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ప్రతి కుటుంబం సంక్రాంతి, కనుమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

18న మోడల్ పరీక్ష

గుంతకల్లుటౌన్: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్‌కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న యువతీ, యువకులకు ఈ నెల 18న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు చరణ్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు తెలిపారు. శనివారం మోడల్ పరీక్షకు సంబంధించిన పోస్టర్లను డీఎస్పీ నరసింగప్ప చేతుల మీదుగా విడుదల చేయించారు.

అనంత అభివృద్ధిపైనే ధ్యాస



అండర్ పాస్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: పండుగ పూట సైతం అనంత అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముందుకెళ్తున్నారు. సాధ్యమైనంత త్వరగా జాతీయ రహదారి విస్తరణ, బ్రిడ్జ్ పనులు పూర్తి చేయించేందుకు పరితపిస్తున్నారు. బళ్లారి బైపాస్ నుంచి క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా పంగల్ రోడ్డు వరకు రూ.313 కోట్లతో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం పరిశీలించారు. క్లాక్‌టవర్ వద్ద అండర్ పాస్ పనులను పరిశీలించారు. నిర్దేశించిన సమయం కంటే పనులు వేగంగా జరుగుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో వాహనరాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రహదారికి ఇరువైపులా జరుగుతున్న కాలువ పనులను పరిశీలించిన ఆయన నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు.

రోడ్లపై గుంతలు తీయకుండా చూడండి

అనంతపురం క్రైం: నగరాభివృద్ధిలో భాగంగా రూ.లక్షలు వెచ్చించి రోడ్లు వేస్తుంటే ప్రైవేట్ ఏజెన్సీవారు రోడ్లకు గుంతలు తవ్వడం సరికాదని, ఎక్కడపడితే అక్కడ గుంతలు తీయకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ నాగమోహన్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఫోన్‌లో శనివారం ఆదేశించారు. 49వ డివిజన్‌లో రూ.లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుకు గుంత ఏర్పాటు చేయడం చాలా బాధాకరమన్నారు. పోళ్లను క్రమ పద్ధతిలో వేయకపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. వందలాది పోళ్లను మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నగర ప్రజల ఇబ్బంది పడకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేడుతుంటే, ఇలా గుంతలు తీయడమేంటని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: దళిత, గిరిజనుల భూములను ఆక్రమించుకోవడం తోనే ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన సాకే వేదవతిని ఆయన పరామర్శించారు. అనంతరం సాకే హరి మాట్లాడుతూ బత్తలపల్లి వద్ద సర్వే నెం. 152-9 లో 1.72 సెంట్లు ప్రభుత్వ భూమి భర్త మరణానంతరం డీ పట్టాను పొందిందన్నారు. గతంలో మామ దళిత గంగన్న, భర్త వెంకటేష్ అప్పు చేశారని జక్కంపూడి పురుషోత్తం చౌదరి భూమి ఆక్రమించుకున్నాడన్నారు. మామ, భర్త చనిపోయిన తరువాత భూమి రాసివ్వాలని అనేకసార్లు బెదిరింపులకు గురి చేశారన్నారు. వేదవతికి ప్రాణాపాయం జరిగితే భూ ఆక్రమణదారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రేకులకుంట రామాంజనేయులు, రామకృష్ణ, ప్రతాప్, సురేష్, గోపాల్ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

17న జాతర

పామిడి: పీ కొండాపురంరోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ 15వ జాతర ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. తొలిరోజు పాలపళ్ల విభాగం, 18న న్యూ కేటగిరి విభాగానికి సంబంధించి ఎద్దుల రాతిదూలం లాగుడు పందెం పోటీలు ఉంటాయన్నారు. పాలపళ్ల విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు. అదే న్యూ కేటగిరి విభాగానికి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.రూ.10 వేలు, రూ.5 వేలు ఉంటాయన్నారు.

బాలకృష్ణ దేవాంగులకు క్షమాపణ చెప్పాలి

అనంతపురం టవర్‌క్లాక్: సినీనటుడు నందమూరి బాలకృష్ణ దేవాంగ మూలగురువుని కించపరిచేలా వ్యాఖ్యానించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీకే నాగరాజు అన్నారు. శనివారం స్థానిక రైతు బజారులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలకృష్ణ సినిమా ప్రీరిలీజ్ వేడుకలో మీడియాతో మాట్లాడుతూ దేవాంగుల కులగురువు మను బ్రహ్మ, ఆయన గురువు రావణుడని, వీళ్ల రాక్షసజాతికి చెందిన వారని హేళనగా మాట్లాడారన్నారు.బాలకృష్ణక్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ లైట్లను ప్రారంభించిన మేయర్



హైమాస్ లైట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని 47వ డివిజన్ రంగస్వామి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను మేయర్ వసీం శనివారం ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు వివిధ డివిజన్లలో హైమాస్, స్ట్రీట్ లైటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఎన్‌టీఆర్ మార్గ్, గుత్తి రోడ్డు, విద్యుత్‌నగర్ సర్కిల్ తదితర రోడ్లలో బటర్ ఫ్లై లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లోనూ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు దుర్గాదేవి, శ్రీనివాసులు, ఇస్హాక్, నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.

మేయర్ సంక్రాంతి శుభాకాంక్షలు

అనంతపురం క్రైం: నగర ప్రజలకు మేయర్ వసీం శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సంతోషాలు నింపే సంక్రాంతి పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. నగరాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో వివిధ డివిజన్లలో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వాలీబాల్ టోర్నీ విజేతకు నగదు పురస్కారం



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తరఫున విజేతలకు షీల్డ్, నగదు అందజేస్తున్న టోర్నీ నిర్వాహకులు

కనగానపల్లి: మండలంలోని వేపకుంటలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఎనుములపల్లి జట్టుకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నగదు పురస్కారం చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో చుట్టు పక్కల గ్రామాల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఎనుములపల్లి, వేపకుంట జట్లు తలపడగా ఎనుములపల్లి జట్టు విజయ సాధించింది. వీరికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తరఫున స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విజేతలకు రూ.12 వేల నగదు అందించారు. రన్నర్స్‌గా నిలిచిన వేపకుంట జట్టుకు టోర్నీ నిర్వాహకులు రూ.6 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టోర్నీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.